క్లుప్తంగా

జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి


నీటి నిల్వలను పరిశీలిస్తున్న జిల్లా మలేరియా అధికారి

చిత్తూరు రూరల్(కాణిపాకం): జ్వరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉంటూ, ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా మలేరియా అధికారి శ్రీనివాసులు అన్నారు. చిత్తూరు నగరంలోని వెంగళ్‌రావ్‌కాలనీ శుక్రవారం జరిగిన ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఆ ప్రాంతాల్లో నీటి నిల్వలను ఆరా తీశారు. అపరిశుభ్ర ప్రాంతాలను గుర్తించి వెంటనే శుభ్రపరిచేలా చర్యలు తీసుకున్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, ఎండల తీవ్రతతో జ్వరం, వడదెబ్బ తగిలే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో అధికారుల పీరుసాహెబ్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరులో చిరుజల్లులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగర, మండల వ్యాప్తంగా శుక్రవారం ఎండలు తారెత్తించాయి. మధ్యాహ్నం వరకు ఎండలు భగభగమండిపోయాయి. జనం బయట అడుగుపెట్టలేక ఉక్కిరిబిక్కిరయ్యారు. ఉక్కపోతతో అల్లాడిపోయారు. వివిధ పనుల నిమిత్తం బయటకొచ్చిన జనం కాస్త నీడ దొరికినా తలదాచుకునే పనిలో పడ్డారు. మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఉరుములు, మెరుపులు భయపెట్టాయి. ఆపై చిరుజల్లులు కురిశాయి. భూమి తడిచి కాస్త చల్లదనాన్ని పరిచాయి.

హేమలతకు డాక్టరేట్



చిత్తూరు కలెక్టరేట్: నగరానికి చెందిన హేమలతకు తిరుపతి జిల్లా ఎస్వీ యూనివర్సిటీ పరీక్షల విభాగం కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ దామ్లానాయక్ శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చారు. పరిశోధన గ్రంథాన్ని ఎస్వీ యూనివర్సిటీ వృక్షశాస్త్ర విభాగం ప్రొఫెసర్ యశోదమ్మ పర్యవేక్షణలో పూర్తి చేశారు. పరిశోధన గ్రంథాన్ని పూర్తి చేసి సమర్పించినందుకు గాను ఎస్వీ యూనివర్సిటీ ఆమెకు డాక్టరేట్ ప్రదానం చేసింది.

సీఎంసీకి వెళ్లి రూ.10వేలు పింఛన్ అందజేత


పింఛన్ అందిస్తున్న కార్యదర్శి జ్యోతీశ్వరన్

గుడిపాల: మండలంలోని గొల్లమడుగు పంచాయతీ గొల్లమడుగు గ్రామానికి చెందిన మనోహర్‌రెడ్డి కిడ్నీ వ్యాధితో బాధపడుతూ డయాలసిస్ చేసుకుంటున్నాడు. పదిరోజులుగా తమిళనాడులోని రాణిపేట సీఎంసీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. వారం రోజుల క్రితం కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్స చేసుకున్నారు. ప్రస్తుతం ఐసీయూలో ఉన్నారు. శుక్రవారం పంచాయతీ కార్యదర్శి జ్యోతీశ్వర్ ఆస్పత్రికి వెళ్లి రూ.10వేల పింఛన్‌ను ఆయనకు అందజేశారు.

వైద్యసేవలను వినియోగించుకోండి


వైద్య సేవలందిస్తున్న డాక్టర్ అనూష

గుడిపాల: మండలంలోని గ్రామాల్లో అందించే వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని బొమ్మసముద్రం వైద్యాధికారి అనూష తెలిపారు. నంగమంగళం గ్రామంలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గతంలో మండల కేంద్రాలకు రావాల్సి ఉండేదని, ప్రస్తుతం గ్రామంలోకి వచ్చి వైద్యసేవలు అందిస్తున్నట్లు చెప్పారు. అనంతరం 62 మందికి చికిత్సలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది పవిత్ర, శ్రీలత, వరలక్ష్మి, సరిత పాల్గొన్నారు.

కాణిపాకంలో వడగళ్ల వాన

కాణిపాకం: కాణిపాకంలో శుక్రవారం వడగళ్ల వాన కురిసింది. ముందుగా బలమైన ఈదురు గాలులు ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి వర్షం మొదలైంది. ఈక్రమంలో కొంతసేపు వడగళ్లు పడ్డాయి. దీంతో వాతావరణంలో కాస్త చల్లదనం ఏర్పడింది. ప్రజలు కాస్త ఎండ నుంచి ఉపశమనం పొందారు.


పచ్చగడ్డిపై పడిన వడగండ్లు

వారిది ధనబలం.. మాది జనబలం

- అన్ని వర్గాల ప్రజలకు మేలు చేసింది జగనన్న ప్రభుత్వమే
- ఓట్లడిగే అర్హత వైఎస్సార్‌సీపీకే ఉంది
- చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి



చిత్తూరు: టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన నాయకులతో చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి, సంతపేటలో మహిళను ఓటడుగుతున్న విజయానందరెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: రాష్ట్రంలో పేదలకు–పెత్తందార్లకు మధ్య జరుగుతున్న యుద్ధంలో ధన బలంతో విర్రవీగుతున్న కూటమిని, తరిమికొట్టాలని వైఎస్సార్‌సీపీ చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక 03, 49 డివిజన్లలో శుక్రవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పాల్గొని మాట్లాడారు. ఎన్నికల్లో టీడీపీ కూటమిది ధన బలమని, వైఎస్సార్‌సీపీది ప్రజా బలమని అన్నారు. కూటమి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులకు కనీసం స్థానిక పరిస్థితులపై అవగాహన లేదని చెప్పారు. కేవలం డబ్బుతో ఓట్లు కొనుగోలు చేసి గెలిచేయచ్చన్న భ్రమలో వారు ఉన్నారని విమర్శించారు. వైఎస్సార్‌సీపీకి కార్యకర్తలు, ప్రజలే బలమని ఉద్ఘాటించారు. జగనన్నకు వస్తున్న ప్రజాదరణ చూసి కూటమి నాయకులు ఓర్వలేకపోతున్నారని చెప్పారు. సంక్షేమ పథకాలు జగనన్న ఇస్తుంటే రాష్ట్రం నాశనం అవుతుందన్న చంద్రబాబు, ఇప్పుడు ప్రకటించిన మేనిఫెస్టో అమలు చేయాలంటే దేశ బడ్జెట్ కావాలని చెప్పారు. పూటకోమాట, రోజుకో అబద్ధం, ఊరికో హామీ ఇలాంటివన్నీ ఆయనకే సాధ్యమన్నారు. అందరూ ఫ్యాను గుర్తుకు ఓట్లేసి జగనన్న సంక్షేమ పాలనను మళ్లీ తెచ్చుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మేయర్ అముద, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్ రెడ్డి, నగర పార్టీ అధ్యక్షుడు జ్ఞానజగదీష్, టౌన్ బ్యాంకు చైర్మన్ రాంగణేష్, కార్పొరేటర్ సునీత, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి నాయకులు శివకుమార్, నారాయణ, ద్వారక, అప్పోజీ, రవిచంద్రారెడ్డి, శివారెడ్డి, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

జగన్ కోసం సిద్ధం

గత ఐదేళ్లలో ప్రజలకు జరిగిన మేలు, ప్రస్తుతం ప్రకటించిన మేనిఫెస్టోను ప్రజలకు తెలియజేశారు. నగరంలో నాయకులు, బూత్ కమిటీ సభ్యులు ప్రచారం చేశారు. ఓటర్ల అనుమతితో వారి ఫోన్ నుంచి 9612096120 నంబర్‌కు మిస్‌కాల్ ఇచ్చి వచ్చినా ఐడీ నెంబర్‌ను స్టార్ క్యాంపెయినర్ల ఐడీ కార్డును అందజేశారు. తదనంతరం ఇంటి గోడ, తలుపుల మీద వారి అనుమతిలో సిద్ధం అనే స్టిక్కర్లు అతికించారు. 2014 ఇచ్చిన హామీలే మళ్లీ 2024లో బాబు ప్రకటించారన్నారు. అప్పుడే తీర్చనిది ఇప్పుడు ఎలా తీరుస్తారో అని చెప్పారు. ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి ప్రజలకు చేసిన సేవలను ముద్రించిన కరపత్రాలు అందజేశారు. చవటపల్లెలో టౌన్‌బ్యాంకు చైర్మన్ రాంగణేష్ నాయకులు కరుణకరన్, ప్రసాద్‌రెడ్డి, 40వ డివిజన్‌లో కార్పొరేటర్ గణేష్, నాయకులు శరవణ, కొంగారెడ్డిపల్లె, ఇరువారంలో బూత్‌కమిటీ సభ్యులు ప్రచారం చేశారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి..

చిత్తూరు ఇరువారం పీహెచ్‌కాలనీకు చెందిన టీడీపీ నాయకులు శుక్రవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి కండువా వేసి ఆహ్వానించారు. పార్టీలో చేరినవారిలో సంతోష్, నటరాజ్, అజయ్, మహేష్, కుమార్, నవీన్, మోహన్, మదన్, ఆర్ముగం, శివ, మోహన్‌బాబు, సంజయ్, జాన్సన్ ఉన్నారు.

చిత్తూరు రూరల్(కాణిపాకం): మళ్లీ రానున్నదని జగనన్న ప్రభుత్వమేనన్ని జెడ్పీటీసీ ఎం.ఎస్ బాబునాయుడు అన్నారు. చిత్తూరు మండలం అనంతాపురం పంచాయతీలో శుక్రవారం రాత్రి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేసి ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమాన్ని వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టీడీపీ అబద్ధపు మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. ఈ ఐదేళ్లల్లో జగనన్న చేసిన మేలును మర్చిపోవదన్నారు. ఫ్యాన్‌గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్‌సీపీని గెలిపించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు భాస్కర్, పట్టాభి, పీటర్, రంజన్, చంద్ర, జాన్, శోభన్‌బాబు, ఆబ్రూ పాల్గొన్నారు.





చిత్తూరు: సంతపేటలో విజయానందరెడ్డి పర్యటనలో నృత్యం చేస్తున్న యువకులు, 40వ డివిజన్‌లో కార్పొరేటర్ గణేష్ ప్రచారం, గుడిపాల: బండపల్లెలో వైఎస్సార్‌సీపీ నాయకుల ప్రచారం, గుడిపాల: బసవాపల్లెలో ఓటడుగుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

17 మంది వలంటీర్ల రాజీనామా


గుడిపాల: వెప్పాలమానుచేనులో రాజీనామా చేసిన వలంటీర్లు


గుడిపాల: పాపసముద్రం పంచాయతీలో రాజీనామా చేసిన వలంటీర్లు

గుడిపాల: మండలంలోని 17మంది వలంటీర్లు శుక్రవారం రాజీనామా చేశారు. వారి రాజీనామాలను ఎంపీడీవో రాజశేఖర్‌రెడ్డికి వారు అందజేశారు. వారు మాట్లాడుతూ టీడీపీ నాయకులు తమపై చేస్తున్న దుష్ప్రచారానికి నిరసనగా రాజీనామా చేసినట్లు తెలిపారు. ఇకపై ఇంటింటికీ వెళ్లి జగన్‌మోహన్‌రెడ్డి చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తామన్నారు. జగనన్నను మళ్లీ సీఎం చేసుకుంటామని స్పష్టం చేశారు. రాజీనామా చేసిన వారిలో పాపసముద్రం పంచాయతీలో 11మంది, వెప్పాలమానుచేనులో 6 మంది వలంటీర్లు ఉన్నారు.

మమ్మల్ని కష్టపెట్టిన బాబుకు పుట్టగతులుండవ్


బ్యాంకు వద్ద పింఛన్ కోసం నిరీక్షిస్తున్న పింఛనుదారులు

గుడిపాల: ఐదేళ్ల నుంచి ఇంటి వద్దే అందుకుంటున్న పింఛన్లను చంద్రబాబు ఎన్నికల కమిషన్ ద్వారా అడ్డుకున్నారు. వలంటీర్లపై అక్కసుతో ఈసీకి ఫిర్యాదు చేయడంతో వారి సేవలను నిలిపివేసింది. ఫలితంగా పండుటాకులు పింఛన్ కోసం నానా అవస్థలు పడుతున్నారు. ఈ క్రమంలో గత నెల సచివాలయాల వద్ద పింఛన్లు అందించడంతో కాస్త ఓపికతో నిరీక్షించి అయినా పింఛను డబ్బులు చేతికందాయి. అయితే అవ్వాతాతలు సుఖంగా ఉండడం చంద్రబాబుకు నచ్చలేదు. ఫలితంగా మరో సారి ఈసీకి ఫిర్యాదు చేసి పింఛనుదారుల ఖాతాల్లో పింఛను సొమ్ము జమ చేయాలంటూ ఈసీ ద్వారా ఆదేశాలు ఇప్పించారు. విధిలేక ప్రభుత్వం ఈ సారి పింఛను మొత్తాలను బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది. అయితే ఎక్కడో మండల కేంద్రాల్లో ఉన్న బ్యాంకులకు వెళ్లలేక వృద్ధులు, దివ్యాంగులు నానా అగచాట్లు పడుతున్నారు. ఆటోల్లో, బస్సుల్లో చార్జీలు పెట్టుకుని అక్కడికి వెళ్లినా ఫలితం దక్కలేదు. బ్యాంకు ఖాతాలు చాలా వరకు వినియోగంలో లేకపోవడం, బ్యాంకుల్లో సర్వర్లు పనిచేయకపోవడం వంటి కారణాలతో ఇప్పటికీ పింఛను వారిచేతికందడం లేదు. ఈ మండుటెండల్లో వారు పింఛన్ కోసం పడుతున్న అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయి. అయితే దీనికి కారణమైన చంద్రబాబుకు శాపనార్థాలు పెడుతున్నారు.

ఎక్కడికి వెళ్లాలో తెలియడం లేదు



పింఛను కోసం సచివాలయానికి వెళితే బ్యాంకు ఖాతాలో డబ్బులు వేశాం అని చెప్పారు. బ్యాంకుకు వెళితే నగదు జమ కాలేదు అని బ్యాంకు వారు చెప్పడంతో వెనుదిరిగాను. ఇంతకీ నాకు రావాల్సిన డబ్బులు ఎక్కడ ఉందో తెలియదు. చంద్రబాబునాయుడు మాకు పింఛన్‌లు ఇవ్వకుండా ఇలా చేస్తున్నాడు. మాలాంటి వృద్ధుల ఉసురు ఆయనకు తప్పకుండా తగులుతుంది. రానున్న ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెబుతాం.

– చెంగమ్మ, వృద్ధురాలు, గుడిపాల

ఇంటికి వస్తున్న పింఛన్ ఆపేశారు



ప్రతి నెలా ఇంటికి వస్తున్న పింఛన్‌ను ఇవ్వకుండా ఆపేశారు. బ్యాంకు ఖాతాలో జమ చేస్తాం అని చెబుతున్నారు. ముసలోళ్లు అయిన మేము బ్యాంకులకు ఎట్లా వెళ్లాలి. బ్యాంకు ఖాతా వాడకుండా చాలా సంవత్సరాలు అయ్యింది. ఖాతా ఉందో లేదో కూడా తెలియడం లేదు. చంద్రబాబునాయుడు ఇలా చేస్తున్నాడని అందరూ చెబుతున్నారు. మాలాంటి ముసలోళ్లతో చెలగాటమాడుతున్న బాబుకు పుట్టగతులుండవ్.

–సరోజమ్మ, వసంతాపురం, గుడిపాల

పోల్ డే యాప్‌లో సత్వర సమాచారం


శిక్షణలో పాల్గొన్న పీఓ, ఏపీఓలు


శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న చిత్తూరు అసెంబ్లీ ఆర్‌ఓ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్: పోలింగ్ రోజున పోల్ డే మానిటరింగ్ యాప్‌లో సత్వర సమాచారం తెలియజేయాలని చిత్తూరు అసెంబ్లీ ఆర్‌ఓ శ్రీనివాసులు ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం పీఓ, ఏపీఓలకు రెండు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. మొదటి రోజు శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న ఆర్‌ఓ మాట్లాడుతూ గతంలో ఎన్నికల విధులు నిర్వహించినా కొత్తగానే ఉంటుందన్నారు. ఎన్నికల నిర్వహణలో పీఓల పాత్ర చాలా కీలకమన్నారు. ఈవీఎం యంత్రాల వినియోగంపై అవగాహన పెంచుకోవాలని తెలిపారు. ఈ నెల 13 తేదీన ఉదయం 5.30 గంటలకు మాక్ పోలింగ్ నిర్వహించి 50 ఓట్లు ఏజెంట్ల సమక్షంలో వేయించాలన్నారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ ఉంటుందని చెప్పారు. పీఓలు తప్పనిసరిగా పీఓ డైరీని రాయాలన్నారు. ప్రతి రెండు గంటలకోసారి పోలింగ్ శాతాన్ని పోలింగ్ డే యాప్‌లో పంపించాలని తెలిపారు. విధుల పట్ల అలసత్వం వహిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. అనంతరం పీఓ, ఏపీఓలకు మాస్టర్ ట్రైనర్స్ శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణా కార్యక్రమంలో ఏఆర్‌ఓలు అరుణ, చిత్తూరు ఎంఈఓలు సెల్వరాజ్, మోహన్ పాల్గొన్నారు.

పల్లె పల్లెనా ప్రగతి పూలు

- నియోజకవర్గంలో 73 పక్కా భవనాలు
- రూ.20.26 కోట్లతో నిర్మాణాలు
- అందుబాటులో సచివాలయాలు, ఆర్‌బీకేలు, హెల్త్‌క్లినిక్‌లు


చింతలగుంటలోని హెల్త్‌క్లినిక్



వసంతాపురంలోని సచివాలయం


నంగమంగళంలోని రైతుభరోసా కేంద్రం

చిత్తూరు కార్పొరేషన్: జగనన్న ప్రభుత్వం గ్రామ స్వరాజ్యానికి పెద్దపీట వేసింది. ఫలితంగా పల్లె పల్లెనా ప్రగతి పూలు విరబూశాయి. సచివాలయ వ్యవస్థను అమల్లోకి తీసుకువచ్చిన ప్రభుత్వం వాటికి సొంత భవనాలను సమకూర్చింది. చిత్తూరు రూరల్, గుడిపాల ప్రాంతాల్లో సచివాలయాలు, ఆర్‌బీకేలు, వైఎస్సార్ హెల్త్‌క్లినిక్ సొంత భవనాలు నిర్మించారు. మొత్తం రూ.20.26 కోట్లతో 73 సొంత భవనాలు నిర్మించారు. దీంతో ప్రభుత్వ సేవలన్నీ మారుమూలన గ్రామాల్లో ఉన్న ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం సాకారమైంది.

స్థానిక సంస్థలను బలోపేతం చేయడం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు 2019 అక్టోబరు 2వ తేదీ గాంధీ జయంతి రోజున సచివాలయ వ్యవస్థను ప్రారంభించారు. గ్రామాల్లో రెండు వేల జనాభా ప్రాతిపదికన సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేశారు. గ్రేడ్–4 పంచాయతీ కార్యదర్శి, ఏఎన్‌ఎం వెల్ఫేర్ అసిస్టెంట్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్, విలేజ్ సర్వేయర్, అగ్రికల్చర్ అసిస్టెంట్, పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్, ఉద్యాన అసిస్టెంట్, డిజిటల్ అసిస్టెంట్ తదితర పోస్టులను నియమించారు. గత ప్రభుత్వంలో పంచాయతీ కార్యాలయంలో సెక్రటరీ, బిల్ కలెక్టర్, అటెండర్ పేరిట ముగ్గురు, నలుగురు ఉద్యోగులు మాత్రమే ఉండేవారు. అన్ని శాఖల సిబ్బంది అందుబాటులో లేక చాలా వరకు పనుల నిమిత్తం ప్రజలు వ్యయప్రయాసలకోర్చి మండల కార్యాలయాలకు వెళ్లాల్సి వచ్చేది. ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత 11 ప్రభుత్వ శాఖలకు చెందిన ఉద్యోగులను సచివాలయాల్లో నియమించడం వల్ల అన్ని సేవలు సచివాలయాల్లో అందేలా చర్యలు తీసుకున్నారు. ప్రజలు ఉద్యోగులకు సౌకర్యవంతంగా ఉండే విధంగా కార్పొరేట్ కార్యాలయాల తరహాలో సచివాలయ భవనాలకు ప్రత్యేక డిజైన్ రూపొందించారు. ఒక్కో భవనానికి ప్రభుత్వం రూ.40 లక్షల వరకు ఖర్చు చేస్తున్నారు. ఉద్యోగుల కోసం రెండు గదులు, ఒక హాల్, శానిటేషన్ సామగ్రి కోసం స్టోర్ రూమ్, మొదటి అంతస్తులో రెండు గదులు, సమావేశాలు నిర్వహించేందుకు వీలుగా విశాలమైన హాల్‌తో భవనాలు నిర్మిస్తోంది.

73 ప్రాంతాల్లో ..

చిత్తూరు రూరల్, గుడిపాల మండలాల్లో గత ఐదేళ్లగా మొత్తం 73 పక్కా భవనాలు నిర్మించారు. సచివాలయ నిర్మాణానికి రూ.40 లక్షలు, ఆర్‌బీకేలకు రూ.21.80 లక్షలు, హెల్త్‌క్లినిక్‌లకు రూ.20.08 లక్షల చొప్పున నిధులు కేటాయించారు. సచివాలయాలు 26 నిర్మించగా ఇందుకు రూ.10.40 కోట్లు ఖర్చు చేశారు. అలాగే ఆర్‌బీకేలు 25 కట్టగా వీటికి రూ.5.45 కోట్లు వ్యయం చేశారు. వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు 22 నిర్మించగా వీటికి రూ.4.41 కోట్లు పెట్టారు. ఈ లెక్కన మొత్తం 73 భవనాలకు రూ.20.26 కోట్లు ఖర్చు పెట్టారు.

పల్లె మారింది



గత 5 సంవత్సరాలుగా పల్లె రూపురేఖలు మారాయి. పంచాయతీల్లో పక్కా భవనాలను నిర్మిస్తున్నారు. సేవలను ఇంటి ముంగిటకు తెచ్చారు. గ్రామాల అభివృద్ధికి నిధులు ఇచ్చి ప్రాధాన్యత కల్పిస్తున్నారు. మౌలిక వసతులు, సంక్షేమం అందిస్తున్నారు.

–సురేంద్ర, బండపల్లె, గుడిపాల మండలం

గుర్తుండి పోయేలా..



ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సచివాలయం, ఆర్బీకే, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు అందుబాటులో తీసుకొచ్చారు. ఏ చిన్న సమస్య వచ్చినా ఉన్న ఊర్లోనే ఈ సేవలను వినియోగించుకోవచ్చు.

–సెల్వం, తుమ్మలవారిపల్లె, గుడిపాల మండలం

గాలీవానతో ట్రాన్స్‌కోకు నష్టం రూ.9 లక్షలు


చిత్తూరులో కూలిన విద్యుత్ స్తంభం

చిత్తూరు కార్పొరేషన్: చిత్తూరు ట్రాన్స్‌కోకు అర్బన్, రూరల్ డివిజన్ల పరిధిలో గాలీవాన కారణంగా రూ.9 లక్షలు నష్టం వచ్చిందని ఈఈలు పద్మనాభ పిళ్లై, హరి తెలిపారు. చిత్తూరు అర్బన్ డివిజన్ పరిధిలో విద్యుత్ పరికరాలు దెబ్బతినడంలో రూ.5 లక్షలు, రూరల్ పరిధిలో రూ.4 లక్షలు నష్టం వచ్చిందన్నారు.

అర్బన్ డివిజన్‌లో దెబ్బతిన్నవి

9.1 మీటర్ల విద్యుత్ స్తంభాలు	:	8
8 మీటర్ల స్తంభాలు	:	12
100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు	:	1
25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు	:	4
15 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు	:	2
కండక్టర్లు	:	1.08 కిలోమీటర్లు
కేబుల్స్	:	420 మీటర్లు
11 కేవీ డిస్క్‌లు	:	14
11 కేవీ పిన్స్	:	15
ఫ్యూజ్ సెట్	:	7

రూరల్ డివిజన్ పరిధిలో దెబ్బతిన్నవి

33 కేవీ విద్యుత్ స్తంభాలు	:	5
11 కేవీ 32. ఎల్‌టీవి	:	21
25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు	:	3
15 కేవీట్రాన్స్‌ఫార్మర్	:	1
కండక్టర్లు	:	0.25 మీటర్లు
11 కేవీ డిస్క్‌లు	:	12
11 కేవీ పిన్స్	:	5
ఫ్యూజ్ సెట్లు	:	2